**కథ**

# ముక్కుపుడక

**హేమంత**

**అసలు ఆ పదంలోనే తెలుగుతనం తొణికిసలాడుతుంది. ఆ ఐదక్షరాల పదాన్ని విన్నా పలికినా పంచాక్షరీ మంత్రాన్ని జపించినంత ఆనందాన్ని పొందుతుంది జానకి. చిన్నప్పుడు హైస్కూల్లో చదువుకునే రోజుల్లో తన పక్క బెంచీ అమ్మాయి కాత్యాయిని, ముక్కుపుడకపై కిటికీలో నుండి ఎండపడి ముక్కుపుడకలో పొదిగిన పచ్చరాయి తళుక్కుమని మెరుస్తుంటే జానకి మనస్సు బాధగా మూలిగేది.**

చెయ్యి అప్రయత్నంగా ముక్కుపైకి పోయేది. ఇంటికెళ్లగానే అమ్మ మెడ చుట్టూ చెయ్యివేసి గారాలు పోతూ, ‘‘అమ్మా నేనూ ముక్కు కుట్టించుకుంటాను. కాత్యాయిని ముక్కుపుడక లాంటిది పెట్టుకుంటాను’’ అంటే అమ్మ ప్రేమగా దగ్గరకు తీసుకుని నుదుటిమీద ముద్దుపెట్టుకుని, ముక్కు పట్టుకుని ఊపుతూ ‘‘నీ ముక్కే బంగారం. దానికెందుకు అలంకారం’’ అంటూ మాయ చెయ్యడానికి ప్రయత్నించింది.

జానకి మాత్రం పట్టువదలని విక్రమార్కుడికి చెల్లెలులా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. తండ్రిని అడిగే ధైర్యం లేదు. ఒకసారి జానకి పోరు పడలేక తల్లి సుమతి భర్తను నెమ్మదిగా అడిగింది. ‘‘పాపం పిచ్చిపిల్ల ఒకటే గొడవండీ ముక్కుపుడక కావాలని. పోనీ ముక్కు కుట్టిద్దామా’’ అంది. అంతే అంత ఎత్తున లేచి ‘‘నీకస్సలు బుద్ధి ఉందా? అదేదో తెలివితక్కువగా అడిగితే దానికి నచ్చచెప్పేది పోయి నాదాకా తీసుకొస్తావా? మా వంశంలో ఆడపిల్లలకు ముక్కుపుడక అచ్చిరాలేదని ఎన్నిసార్లు చెప్పాను’’ అంటూ గర్జించేటప్పటికి పాపం సుమతి బెదిరిపోయింది.

అది చూసిన జానకి బిక్కమొఖం వేసి, పమిట కొంగుతో కళ్లొత్తుకుంటున్న తల్లిని రెండుచేతులలో చుట్టేసి ‘‘అమ్మా ఇంకెప్పుడూ పేచీ పెట్టనమ్మా. నాన్నను ఇంకెప్పుడూ అడగవద్దు’’ అంది.

పైకి అలా అన్నదే కానీ జానకి మనస్సులో కోరిక రోజురోజుకీ ‘ఇంతింతై వటుడింతై’ అన్న రీతిలో పెరగసాగింది. ప్రహ్లాదుడికి ‘ఎందెందు వెతికినా అందందే శ్రీహరి’ కనిపించినట్లు ఎవరిని చూసినా వాళ్ల ముక్కుకి ఉన్న ముక్కుపుడకే కనిపిస్తోంది. జానకిని కవ్విస్తోంది.

చిన్నారి జానకి ఎదిగి యవ్వనంలోకి అడుగుపెట్టింది. బంగారుబొమ్మలా తయారయ్యింది. పెళ్లి నాటికి హైరానా పడకూడదని ఏటా ఏదో ఒక నగ చేయించి అన్నిరకాల నగలు అమర్చాడు తండ్రి. పెళ్లిళ్లకు పేరంటాలకు వెళ్లినపుడు సుమతి నగలన్నీ పెట్టి కూతుర్ని చక్కగా అలంకరించేది. అలంకరణ పూర్తవ్వగానే ‘‘ఎంత ముద్దుగా ఉన్నావే నా దిష్టే తగిలేట్టు ఉంది’’ అని మెటికలు విరిచి దిష్టి తీసేది.

అద్దంలో చూసుకున్న జానకికి ఎన్ని నగలున్నా పాపం ముక్కు మాత్రం బోసిగా అనిపించేది. జానకికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఇప్పుడు ఆమెకి ఒక్కటే ఆశ. పెళ్లయితే భర్త అయినా ముక్కు కుట్టించుకోవడానికి ఒప్పుకోకపోతాడా అని.

పెళ్లి కుదిరింది. నిశ్చితార్థం నాడు కాబోయే అత్తగారు జానకి దగ్గరకొచ్చి ఆప్యాయంగా జానకి చేయి పట్టుకుని, ‘‘పెళ్లికి నీకు పెట్టవలసిన బట్టలు, బంగారం కొనడానికి రేపు మేం పట్నం వెళుతున్నాము. నీకు ఏం కావాలో చెప్పమ్మా’’ అంది అనునయంగా.

జానకి ఠక్కున ముక్కుపుడక అనేదే కానీ... ఇంతలో జానకి మనస్సు చదివినట్లుగా వాళ్ల నాన్న కళ్లతో వారించేటప్పటికి, చేసేది లేక ‘‘మీ ఇష్టం అండీ’’ అంది మెల్లగా. అది విన్న కాబోయే అత్తగారు తెగ మురిసిపోయింది ‘‘నా కోడలికి పెద్దలంటే ఎంత గౌరవమో’’ అని.

పెళ్లయింది, అత్తగారింట్లో అందరూ జానకిని అపురూపంగానే చూసుకుంటున్నారు. భర్త ధోరణి మాత్రం అంతుపట్టలేదు. అస్సలు మాట్లాడడు. ఒకవేళ అవసరం పడి మాట్లాడినా ఉరిమినట్లే ఉంటుంది. దాంపత్య జీవితం అలా మొదలు కావటంతో ముక్కుపుడక ముచ్చట అతనికి చెప్పుకునే అవకాశమే లేకపోయింది.

ఇంటికి పెద్దకొడుకు కావటం వల్ల బాధ్యతలు ఎక్కువ పాపం. అందుకే అలా గంభీరంగా ఉంటాడు అని సరిపెట్టుకుంది. రోజులు గడిచాయి. జానకి ఇద్దరి బిడ్డల తల్లయ్యింది. పిల్లల ఆలనాపాలనా, వాళ్ల చదువులు, ఆ హడావిడిలో జానకి ముక్కుపుడక ముచ్చట మరుగున పడింది.

కొడుకులు ఇద్దరూ ఎదిగి వచ్చారు. వాళ్లకి తండ్రి దగ్గర కన్నా తల్లి దగ్గరే చనువు ఎక్కువ. ఇంట్లో ఉన్నంతసేపూ తల్లి చుట్టూ తిరుగుతూ కబుర్లు చెబుతూ ఛలోక్తులు విసురుతూ ముగ్గురూ మంచి స్నేహితుల్లా ఉంటారు.

ఒకరోజు పెద్దకొడుకు జానకి ఒళ్లో తలపెట్టుకుని పడుకొని ‘‘అమ్మా నీతో ఒక విషయం చెప్పాలి’’ అన్నాడు గారాబంగా.

కొడుకు తల ఆప్యాయంగా నిమురుతూ ‘‘చెప్పు నాన్నా’’ అంది.

‘‘అమ్మా నేనొక అమ్మాయిని ఇష్టపడుతున్నాను. ముందు నువ్వు చూసి సరే అంటే నాన్నకు చెబుతాను’’ అన్నాడు.

‘‘సరే రేపు తీసుకురా’’ అంది.

మరుసటిరోజు సాయంత్రం కొడుకు వెనకాల కొంచెం భయంగా, కొంచెం బిడియంగా నిలుచున్న అమ్మాయిని చూడగానే జానకి మనస్సు ఒక్కసారి సంతోషంతో ఉప్పొంగిపోయింది. కారణం... సాయంసంధ్య వెలుగులో ఆ అమ్మాయి ముక్కుకి ఉన్న పచ్చరాయి ముక్కుపుడక తళుక్కుమంటోంది. జానకి మనసు పాతికేళ్ల వెనక్కి పరుగులు తీసింది.

‘‘అమ్మా అమ్మా’’ అంటున్న కొడుకు పిలుపుతో ఈ లోకంలోకి వచ్చింది. ‘‘అమ్మా ఇదిగో భావన, నిన్న నేను చెప్పింది ఈ అమ్మాయి గురించే’’ అంటూ ఆ అమ్మాయిని పరిచయం చేశాడు.

‘‘నమస్తే ఆంటీ’’ అంది. అమ్మాయి గొంతు చాలా శ్రావ్యంగా ఉంది. ఇందాక ముక్కుపుడక చూసిన ఆనందంలో సరిగా గమనించలేదు. కానీ అమ్మాయి చక్కగా చందనం బొమ్మలా ఉంది. కొడుకు అభిరుచిని మనసులో మెచ్చుకోకుండా ఉండలేకపోయింది.

ఆ అమ్మాయిని పక్కన కూర్చోబెట్టుకుని చదువుసంధ్యలు, తల్లిదండ్రుల వివరాలు అన్నీ అడిగి తెలుసుకుంది. ఇంతలో చీకటి పడింది. ‘‘ఒక్క నిమిషం ఉండమ్మా, తులసికోటలో దీపం పెట్టి వస్తాను’’ అని జానకి లేచింది.

''నువ్వు రా మా ఇల్లు చూద్దువుగాని'' అని కొడుకు భావనను పిలిచాడు. ఇద్దరూ ఇల్లంతా తిరిగి వచ్చేసరికి జానకి దీపం పెట్టింది.

''రావమ్మా... వచ్చి తులసమ్మకు దణ్ణం పెట్టుకో'' అని పిలిచింది. ఆ అమ్మాయి లక్షణంగా మోకాళ్ల మీద కూర్చుని దణ్ణం పెట్టుకుంటోంది. చిరుచీకట్లు ముసురుతున్న వేళ దీపం వెలుగులో ముక్కుపుడక తళుక్కుమంటోంది.

''అబ్బ ఈ అమ్మాయి నా ఇంటి కోడలయితే రోజూ ఈ ముక్కుపుడక కాంతులతో నా ఇల్లు కళకళలాడిపోతుంది'' అనుకుంది.

తరువాత ఇరువైపుల పెద్దలు మాట్లాడుకోవటం, తాంబూలాలు ఇచ్చిపుచ్చుకోవడం, ఆ తరువాత పెళ్లి, అన్నీ వెంట వెంటనే జరిగిపోయాయి.


కోడలు కాపరానికి వచ్చిన మొదటి రోజు.

''భావనా తులసి కోటలో దీపం పెట్టు తల్లీ'' అని పిలిచి తను కూడా కోడలి వెనుకే బయలుదేరింది. దీపం వెలుగులో ముక్కుపుడక అందాలు చూడటానికి.

తులసికోటలో దీపం వెలుగుతోంది. కోడలు కళ్లు మూసుకుని దణ్ణం పెట్టుకుంటోంది. ఏదో వెలితిగా అనిపించింది. మరొక్కసారి పరీక్షగా చూడగా అర్థమయ్యింది. కోడలి ముక్కు బోసిగా ఉంది. మరి ముక్కుపుడక? నెమ్మదిగా గొంతు పెగుల్చుకుని అడిగింది.

''భావనా నీ ముక్కుపుడక ఏది?'' అని. దానికి బదులుగా కోడలు ''తీసేశాను ఆంటీ. నాకు చిన్నప్పటినుండి అదంటే చిరాకు.

నాన్నను ఎంత బ్రతిమాలినా ఒప్పుకోలేదు. ''మనింటి ఆడపిల్ల ముక్కుపుడక లేకుండా తిరిగితే నట్టింటి సిరులు తరిగిపోతాయి, అదీ ఇదీ అంటూ నా ప్రాణం తీసి బలవంతాన ఉంచారు. నేను మీ అబ్బాయిని బ్రతిమాలాను ఆంటీ, లక్కీగా ఆయన ఒప్పుకున్నారు. వెంటనే తీసేశాను. పాతికేళ్లుగా నాకున్న చిన్న ఇబ్బంది, ఈ రోజుతో వదిలిపోయింది. నాకు చాలా సంతోషంగా ఉంది ఆంటీ. ముందు మీకు కృతజ్ఞతలు చెప్పాలి, ఆడవాళ్ల మనస్సుని అర్థం చేసుకునే సంస్కారాన్ని మీ అబ్బాయికి



అలవాటు చేసినందుకు'' అంటూ తన రెండు చేతులూ పట్టుకుని గిరగిరా తిప్పుతున్న కోడలి వంక సంతృప్తిగా చూస్తూ ఉండిపోయింది జానకి. మనసులో మాత్రం 'భగవంతుడా... కనీసం ఈ తరం ఆడపిల్లలకైనా తమ మనసుకి నచ్చినట్టు బ్రతికే స్వేచ్ఛను ఇచ్చావు. అందుకు నీకు కృతజ్ఞతలు'' అనుకుంది.